సాక్షి
మహబూబ్‌నగర్
మంగళవారం ၊ 3 ၊ సెప్టెంబర్ ၊ 2024

జిల్లాలో ముసురు వాన

మహబూబ్‌నగర్ (వ్యవసాయం): జిల్లాలో ముసురు వాన కురిసింది. శని, ఆదివారం భారీ వర్షం కురవగా.. సోమవారం రోజంతా ముసురు కమ్ముకుంది. దేవరకద్ర మండలంలో అత్యధికంగా 35.7 మి.మీ., వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా గండేడ్‌లో 9.6 మి.మీ. వర్షం కురిసింది. కౌకుంట్లలో 34.2 మి.మీ. చిన్నచింతకుంటలో 31.4, హన్వాడలో 30.0, అడ్డాకులలో 30.8, మహబూబ్‌నగర్ అర్బన్‌లో 33.9, రూరల్‌లో 20.1, కోయిలకొండలో 23.4, మూసాపేటలో 27.3, భూత్పూర్‌లో 28.2, నవాబుపేటలో 14.5, బాలానగర్‌లో 10.2, రాజాపూర్‌లో 11.3, జడ్చర్లలో 11.2, మిడ్జిల్‌లో 18.7, మహ్మదాబాద్‌లో 13.9 మి.మీ., కురిసింది.

గరిష్టం/కనిష్టం
26.4 /21.6

వాతావరణం

రోజంతా ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అడపాదడపా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వినాయక మండపాలు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి



మహబూబ్‌నగర్ క్రైం: గణేష్ నవరాత్రుల సందర్భంగా ఏర్పాటు చేసే ప్రతి విగ్రహాన్ని తెలంగాణ పోలీస్ పోర్టల్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎస్పీ జానకి అన్నారు. జిల్లాకేంద్రంలోని అంబేడ్కర్ కళాభవన్‌లో సోమవారం పాలమూరు గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులతోపాటు జడ్చర్ల, భూత్పూర్, దేవరకద్ర మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ హాజరై మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి మండప నిర్వాహకులు https://policeportal,tspolice.gov.in. /index.htm అనే వెబ్‌సైట్‌లో మండపాల వివరాలు పొందుపరచాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడం ద్వారా ఎన్ని విగ్రహాలు ఏర్పాటు చేశారు అనేది స్పష్టత వస్తే దానికి అనుగుణంగా బందోబస్తు ఏర్పాటు చేయవచ్చన్నారు. గతేడాది 2,500 విగ్రహాలు పెట్టారని, ఈ సంవత్సరం ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. మండపాల్లో విద్యుత్ ప్రమాదాలు చోటుచేసుకోకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. 9రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ఉత్సవ కమిటీ నుంచి మండపాల దగ్గర ఉండే వారికి ఐడీ కార్డులు జారీ చేయాలని కోరారు. ప్రతి మండపం దగ్గర సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ఎలాంటి ఘటనలు జరగకుండా ఉంటాయన్నారు. రాత్రి 10 గంటల తర్వాత ఏ మండపం దగ్గర లౌడ్ స్పీకర్లు పెట్టరాదని, మళ్లీ ఉదయం 6 గంటల తర్వాత పెట్టుకోవాలని సూచించారు. ప్రధానంగా ఈ నెల 16న మీల్ ఉలాద్ నబీ పండగ ఉండే అవకాశం ఉందని, ఈ క్రమంలో ఊరేగింపుల్లో ఇతర కమ్యూనిటీలకు ఇబ్బంది రాకుండా చూసుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రశాంత వాతావరణంలో జరుపుకోవడానికి ప్రతిఒక్కరు సహకరించాలని కోరారు. సమావేశంలో ఏఎస్పీ రాములు, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, డీఎంహెచ్‌ఓ పద్మ, డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి కిషోర్, ఉత్సవ కమిటీ సభ్యులు యాదిరెడ్డి, మనోహర్‌రెడ్డి, సీఐలు ఇజాజుద్దీన్, గాంధీనాయక్, అప్పయ్య, ఆదిరెడ్డి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా పాలమూరు అభివృద్ధి



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: రాజకీయాలకతీతంగా అభివృద్ధి పనులు చేపడతామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని న్యూమోతీనగర్‌లో రైల్వే బ్రిడ్జిని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ బ్రిడ్జితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. దాని స్థానంలో కొత్త ఆర్‌యూబీ ఏర్పాటు చేయాలని ఎంపీని కోరగా ఆమె అంగీకరించారు. అంతకుముందు సమీపంలోని గాంధ్లోని చెరువును పరిశీలించారు. దీనికి అనుబంధంగా ఉన్న కాల్వను బాగుచేసి అందులో నీరు తగ్గకుండా చూడాలని మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌కుమార్‌గౌడ్‌కు సూచించారు.

సురక్షిత ప్రాంతాల్లో ఉండాలి

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున ప్రజలందరూ సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని ఎమ్మెల్యే యెన్నం విజ్ఞప్తి చేశారు. సోమవారం ఉదయం న్యూమోతీనగర్‌లోని లోతట్టు ప్రాంతాలను మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, కౌన్సిలర్ జాజిమొగ్గ నర్సింహులుతో కలిసి పరిశీలించారు. దొడ్డలోనిపల్లిలోని రెండు చెరువులు అలుగు పారి తమ ప్రాంతానికి వస్తున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన కాలనీలో డ్రెయినేజీ, సీసీరోడ్లు నిర్మించాలని చైర్మన్‌ను ఆదేశించారు. ముఖ్యంగా దోమల నివారణకు తగు చర్యలు తీసుకోవాలన్నారు.

జీపీఎఫ్ స్లిప్పులు అందజేయాలి

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): జిల్లాలోని ఉపాధ్యాయుల జీపీఎఫ్ ఖాతాల వార్షిక స్లిప్పు లు ఇవ్వాలని పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు సోమవారం జెడ్పీసీఈఓ వెంకట్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా పరిషత్‌లో ఉపాధ్యాయుల జీపీఎఫ్ ఖాతాలు జిల్లాలో 10 వేల మంది ఉన్నారని ఆ ఖాతాలు 2021 నుంచి అప్‌డేట్ కాక పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 2008 నుంచి జీపీఎఫ్ ఖాతాలకు చెల్లించాల్సిన సుమారు రూ.20 కోట్లు ప్రభుత్వం నుంచి జీపీఎఫ్ ఖాతాలకు జమ అయ్యేలా చూడాలని కోరారు.

వరద బీభత్సం..

జిల్లాలో 622 ఎకరాల్లో పంట నష్టం.. 77 ఇళ్లు నేలమట్టం



మిడ్జిల్ మండలంలోని వాడ్యాల్‌లో ఇసుక మేట వేయడంతో దెబ్బతిన్న వరి పంట

- పలు చోట్ల తెగిన రహదారులు.. నిలిచిన రాకపోకలు
- మహబూబ్‌నగర్– తాండూర్ మధ్య రవాణా బంద్
- కౌకుంట్ల– ఇస్రంపల్లి, డోకూర్, జీనుగురాల మధ్య సైతం..
- పలుచోట్ల పనులను పరిశీలించిన ప్రభుత్వ కార్యదర్శి వికాస్‌రాజ్, కలెక్టర్ విజయేందిర బోయి
- వరుణుడు శాంతించడంతో ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న పాలమూరు
- ముసురు వాన, చలి గాలులతో వృద్ధులు, చిన్నారులకు తప్పని తిప్పలు

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఎడతెరిపి లేకుండా రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలతో అతలాకుతలమైన జిల్లా ఇప్పుడిప్పుడే తేరుకుంటోంది. వాగులు, వంకలు పొంగిపొర్లుతుండడం.. అక్కడక్కడ చెరువులు, ఇతర జలాశయాల కట్టలు తెగిపోవడంతో రోడ్లు కొట్టుకుపోయాయి. ఫలితంగా పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వరద పోటెత్తడంతో మహబూబ్‌నగర్, జడ్చర్ల మున్సిపాలిటీలోని లోతట్టు ప్రాంతాలతో పాటు పలు గ్రామాల్లోని కాలనీలు జలమయమైన విషయం తెలిసిందే. వరుణుడు కాస్త శాంతించడంతో అధికార యంత్రాంగం సోమవారం తగిన చర్యలు చేపట్టింది. జిల్లావ్యాప్తంగా వివిధ పంటలు నీటమునగగా.. రైతులు ఆందోళనలో కొట్టుమిట్టాడుతున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయాధికారులు మండలాల వారీగా నీట మునిగిన పంటలను పరిశీలించి నష్టం అంచనా వేయడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై అన్నదాతలకు అవగాహన కల్పించారు. రోజంతా ముసురు వానతో పాటు చలిగాలులు వీస్తుండడంతో వృద్ధులు, చిన్నారులు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులతో సతమతమవుతున్న వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

622 ఎకరాల్లో పంట నష్టం..

జిల్లాలో 389 మంది రైతులకు చెందిన 622 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. ప్రధానంగా పత్తి, వరి, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి. వివిధ మండలాలకు సంబంధించి మొత్తం 39 గ్రామాల్లో 374 ఎకరాల్లో వరి, 117 ఎకరాల్లో పత్తి, 131 ఎకరాల్లో మొక్కజొన్న, జొన్న, బొప్పాయి తదితర పంటలకు నష్టం వాటిల్లింది. వరద నీరు చేరడంతో పాటు ఇసుకమేటలు వేయడం.. పలు చోట్ల ఈదురు గాలులతో వరి నేలవాలినట్లు గుర్తించిన వ్యవసాయాధికారులు నష్టం అంచనా వేశారు. ఈ మేరకు వారు మండలాల వారీగా నష్టపోయిన పంటలను పరిశీలించడంతో పాటు తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలపై రైతులకు సూచనలు చేశారు.అదేవిధంగా వర్షం ధాటికి జిల్లాలో 77 ఇళ్లు పాక్షికంగా ధ్వంసమైనట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.



హన్వాడ మండలం టంకర వద్ద వరి పొలంలో నేలకూలిన విద్యుత్ స్తంభం

వరిపంటకు దెబ్బ..



కేఎల్‌ఐ కాల్వ తెగిపోవడంతో దాదాపు 10 ఎకరాల వరి పంట దెబ్బతిని.. దాదాపు రూ.3 లక్షల వరకు నష్టం వాటిల్లింది. వరి చేనులో మొత్తం ఇసుక మేటలు వేశాయి. ప్రభుత్వం స్పందించి పంటకు నష్టపరిహారం చెల్లించడంతోపాటు ఇసుక మేటలు తొలగించేందుకు సహకరించాలి. – మల్లయ్య, రైతు, వాడ్యాల్, మిడ్జిల్ మండలం

రూ.1.50 లక్షలు నష్టపోయా..



భారీ వర్షాలతో వరద పోటెత్తి.. సాగు చేసిన 3 ఎకరాల పత్తి పంటకు నష్టం కలిగింది. దీంతో సుమారు రూ.1.50 లక్షల వరకు నష్టం చేకూరింది. ప్రభుత్వం స్పందించి పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలి. – అంజనేయులు, రైతు, మున్ననూర్, మిడ్జిల్ మండలం

పంట మునిగింది..



వరి పంట వేయడానికి రెండెకరాలు ఎకరా రూ.10 వేల చొప్పున కౌలుకు తీసుకున్న. కరిగెట, నారుమడి, నాటు వేయడానికి, కూలీలకు, మందు సంచుల కలిపి రూ.40 వేలు దాటింది. తీరా ఇప్పుడు కురిసిన వర్షానికి పంట మొత్తం నీట మునిగింది. – వెంకటయ్య, రైతు, పెన్నాచేడ్, గండేడ్

రెండ్రోజులుగా ఊళ్లోనే..



భారీ వర్షాలు కురుస్తుండటంతో కౌకుంట్ల వాగు ఉప్పొంగి రోడ్డుపై పారుతోంది. దీంతో రాకపోకలు నిలిచిపోయి రెండు రోజులుగా ఊళ్లోనే ఉన్నాయి. ఏదైనా అత్యవసరమైతే వైద్య సహాయం పొందని పరిస్థితి ఉంది. నాయకులు, అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలి. – సలాంపాషా, ఇస్రంపల్లి, కౌకుంట్ల

జిల్లాలో మండలాల వారీగా పంట నష్టం..

మండలాలు	పంట నష్టం (ఎకరాల్లో)			మొత్తం	నష్టపోయిన
	వరి	పత్తి	ఇతర	(ఎకరాల్లో)	రైతులు
మిడ్జిల్	89	62	0	151	76
నవాబ్‌పేట	38	0	44	82	38
మ.నగర్ రూరల్	71	0	75	146	113
మూసాపేట	48	13	0	61	41
చిన్నచింతకుంట	10	10	0	20	05
మహమ్మదాబాద్	05	0	0	05	02
జడ్చర్ల	76	32	12	120	79
దేవరకద్ర	35	0	0	35	34
భూత్పూర్	2	0	0	2	1



గండేడ్ సమీపంలో నీట మునిగిన వరి పంట

తెగిన రోడ్లు.. నిలిచిన రాకపోకలు

మహబూబ్‌నగర్–చించోళీ జాతీయ రహదారికి సంబంధించి హన్వాడ మండలం ఇబ్రహీంపట్నం వద్ద డైవర్షన్ రోడ్డు కొట్టుకుపోయిన విషయం తెలిసిందే. దీంతో మహబూబ్‌నగర్– తాండూర్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. ఈ మేరకు చేపట్టిన పనులను ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ పరిశీలించారు. అదేవిధంగా వనపర్తి–ఆత్మకూర్ ఆర్‌అండ్‌బీ రోడ్డులో ఊకచెట్టు వాగు ఇంకా ఉధృతంగా ప్రవహిస్తుండగా.. రాకపోకలు బంద్ చేశారు. దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కాగా, పంచాయతీ రాజ్‌కు సంబంధించి మూసాపేట, అడ్డాకుల, సీసీకుంట, దేవరకద్ర, మహమ్మదాబాద్, కౌకుంట్ల, మిడ్జిల్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, హన్వాడా, కోయిల్‌కొండ మండలాల్లో దాదాపు 29 రోడ్లు వరద ధాటికి దెబ్బతిన్నాయి.

- కౌకుంట్ల– ఇస్రంపల్లి మధ్య ఉన్న వాగు ఉప్పొంగి రహదారిపై ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రెండు రోజులుగా ఆ గ్రామాల మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. పరిస్థితిని కలెక్టర్ విజయేంద్ర బోయి స్వయంగా పరిశీలించారు. వరద ఉధృతి తగ్గేవరకూ రాకపోకలు పూర్తిగా నిలిపివేయాలని.. ప్రమాదాలు జరగకుండా నిత్యం పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు.



కౌకుంట్ల- ఇస్రంపల్లి మధ్య పారుతున్న వాగు

- దేవరకద్ర మండలంలోని డోకూర్, జీనుగురాల గ్రామాలకు రెండు రోజులుగా రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి గ్రామంలో ఉన్న ప్రధాన రహదారి దగ్గర రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణంలో భాగంగా అధికారులు గేటు మూసివేసి.. ప్రత్యామ్నాయంగా పొలాల గుండా ఒక మట్టి రోడ్డును ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. భారీ వర్షం.. వరద పోటెత్తడంతో మట్టి రోడ్డు మొత్తం కొట్టుకుపోయి చెరువును తలపిస్తుంది. రెండు రోజులుగా వెళ్లేందుకు దారి లేక రెండు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆరు నెలల క్రితం డోకూర్‌లో మొదలుపెట్టిన అండర్ బ్రిడ్జి పనులు ఇప్పటివరకు పూర్తి కాలేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగానే మాకు ఈ పరిస్థితి ఎదురైందని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో పంట నష్టం ఇలా.. (ఎకరాల్లో)	మహబూబ్‌నగర్	నాగర్‌కర్నూల్	వనపర్తి	నారాయణపేట	జోగుళాంబ గద్వాల
	622	1,204	467	6,775	455

వాహనాల రాకపోకలు పునరుద్ధరించాలి



అధికారులతో వివరాలు తెలుసుకుంటున్న ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్, పక్కన కలెక్టర్ విజయేందిర తదితరులు

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్)/ హన్వాడ: మహాలక్ష్మి పథకం కింద ఎన్ని జీరో టికెట్లు జారీ చేశారని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్‌రాజ్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని చాంబర్‌లో కలెక్టర్ విజయేందిరతో కలిసి వివిధ శాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి దాకా ఎంత ఆదాయం వచ్చిందని ఆర్టీసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. చెక్‌పోస్ట్‌ల ద్వారా వస్తున్న రెవెన్యూ, ఇతర వివరాలను ఆర్టీఓతో ఆరాతీశారు. గృహ నిర్మాణ శాఖ ద్వారా ఎన్ని ఇళ్లు నిర్మించారని పీడీ భాస్కర్‌ను ప్రశ్నించారు. అనంతరం హన్వాడ మండలంలోని ఇబ్రహీంబాద్ సమీపంలో జాతీయ రహదారిపై నిర్మించిన తాత్కాలిక రోడ్డు కొట్టుకుపోవడంతో స్వయంగా పరిశీలించారు. రాకపోకలు పునరుద్ధరించేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని జాతీయ రహదారి ఈఈ, డీఈలకు సూచించారు. ఆయన కలెక్టర్ విజయేందిర, అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, మండల ప్రత్యేకాధికారి నర్సింహులు, తహసీల్దార్ కిష్టునాయక్, ఎంపీడీఓ యశోదమ్మ తదితరులున్నారు.



గణేష్‌నగర్‌లోని ఓ గల్లీలో పొంగిపొర్లుతున్న వరద నీరు

కాలనీలకు ముంపు ముప్పు!

36 గంటలైనా పొంగుతున్న పెద్దనాలాలు

- వీధుల్లో రోడ్లపై ఇంకా పారుతున్న వరద నీరు
- ఆందోళనలో జిల్లాకేంద్రంలోని లోతట్టు ప్రాంతవాసులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాకేంద్రంలో వర్షం తగ్గి 36 గంటలైనా ఇంకా పెద్ద నాలాలు పొంగిపొర్లుతూ ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో రోడ్లనిండా అడుగులోతు వరద నీటితో కనిపిస్తున్నాయి. దీంతో ఆయా కాలనీ వాసులు ఆందోళన చెందుతున్నారు. మళ్లీ వర్షం వస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని భయపడుతున్నారు. జానమ్మకుంట నుంచి వీరన్నపేట (వార్డు నం.14) మీదుగా పెద్ద శివాలయం బ్రిడ్జి ద్వారా ఎర్రకుంటకు వరద కొనసాగుతూనే ఉంది. దీంతో కురిహినిశెట్టికాలనీ (వార్డు నం.28)లోని తోట మైసమ్మ ఆలయానికి అటు, ఇటు మూడు వీధుల్లో నీరు చేరుకుంది. అక్కడి నుంచి గణేష్‌నగర్ (వార్డు నం.27) లోని రెండు గల్లీలలో ఇంకా అడుగులోతు వరద పారుతూనే ఉంది. గోల్ మసీదు ప్రాంతంలోని మూడు, పాత పాలమూరులోని మూడు వీధుల మీదుగా మీదుగా ఉధృతంగా ప్రవహిస్తోంది. ఇక పెద్దచెరువు (మినీ ట్యాంక్‌బండ్) కట్ట నుంచి ఊట ఎక్కువగా బయటకు వచ్చి షాషాబ్‌గుట్ట శివాలయం మెయిన్ రోడ్డు సమీపంలోకి చేరుకుంటోంది. అక్కడి నుంచి బీకేరెడ్డి కాలనీ, బీఎన్‌రెడ్డి, నాగిరెడ్డికాలనీల మీదుగా వీధుల్లోని పెద్ద నాలాలు నిండి రోడ్లపై వస్తోంది. కొత్త బస్టాండు వెనక భాగంలోని జగ్జీవన్ రాంనగర్‌లో దాదాపు 20 ఏళ్లలోకి వరదనీరు రావడంతో బకెట్లు, డబ్బాలతో తోడిపోసుకున్నారు. పక్కన పెద్దచెరువు ఉండటంతో ఊటతో పాటు కొత్త బస్టాండు మధ్యలో నుంచి పెద్దనాలా పొంగి ప్రవహించడంతో లోతట్టులోని తమ ఇళ్లు పాడైపోతున్నాయని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికీ లోతట్టు ప్రాంతాలలోని సుమారు 500 ఇళ్ల వారికి ముంపు ముప్పు పొంచి ఉంది. కాగా.. తొమ్మిదో వార్డు పరిధిలోని భాగ్యనగర్‌కాలనీలో మట్టిరోడ్లన్నీ కోతకు గురయ్యాయి. ఎగువ భాగంలోని అయ్యప్పగుట్ట నుంచి వర్షం నీరు జాలువారుతుండడంతో వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణంలో చాలా రోడ్లపై బురద పేరుకుపోయి స్థానికులు అవస్థలు పడుతున్నారు.



గోల్ మసీదు ప్రాంతంలో రోడ్లపై పారుతున్న వరద నీరు



పాతపాలమూరు గల్లీలలోని ఓ వీధిలో పెద్దనాలా నిండి ఇళ్ల మధ్యకు చేరుతున్న వరద నీరు

వర్షం ఆగాక తోడిపోశాం..



రెండు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలకు కాలనీలోకి వరద వచ్చింది. మా చుట్టుపక్కల సుమారు 20 ఇళ్ల వారందరం కొన్ని గంటల పాటు కంటిమీద కునుకు లేకుండా గడిపాం. ఇళ్లలోకి వరదనీరు చేరగా వర్షం ఆగిన తర్వాత బకెట్లతో తోడిపోశాం. సమీపంలోని ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లో ఒకరోజు తలదాచుకున్నాం. మా ఇల్లు పైకప్పు పెచ్చులూడుతోంది. అందులో నివసించడానికి భయమేస్తుంది. ఎప్పుడు ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. – పీఈ ఎలిజబెత్ రాణి, కూలీ, జగ్జీవన్‌రాంనగర్

దుర్వాసన భరించలేకున్నాం..



మా ఇంటి ముందు నుంచి పెద్దనాలా ఉధృతంగా ప్రవహిస్తోంది. గోల్ మసీదు ప్రాంతం నుంచి వరదతో పాటు మురుగు కలిసి మొత్తం దుర్వాసన వస్తోంది. భరించలేకున్నాం. చుట్టుపక్కల సుమారు 20 ఇళ్ల మధ్య రోడ్లపై వరద చుట్టుముట్టింది. రెండు రోజులు కంటిమీద కునుకు లేదు. బయటకు రావాలంటేనే భయమేస్తోంది. మళ్లీ వర్షం వస్తే పరిస్థితిని ఊహించలేకున్నాం. ఎర్రకుంట నుంచి వచ్చే ఈ వరదను అక్కడే మళ్లించి మా కాలనీ సమస్యను పరిష్కరించాలి. – బైని నర్సింహులు, మోచీ, పాతపాలమూరు

పక్కనే పెద్దచెరువు.. తప్పని ఇబ్బందులు



మా కాలనీ సమీపంలోనే పెద్ద చెరువు ఉంది. అందులోకి వరద ఉధృతంగా రాగా కిందికి వెంటనే వదలకపోవడంతో మాకు ఇబ్బందులు తప్పడం లేదు. భారీ వర్షాల కారణంగా స్కూలు పక్కన మొత్తం చెరువులా తయారైంది. మా ఇల్లు చివరలో ఉండటంతో తేళ్లు, విష సర్పాల ముప్పు పొంచి ఉంది. బయటకు రావాలంటే భయమేస్తుంది. రెండు రోజులు లోపలే ఉండిపోయాం. వర్షం వెలిశాక మున్సిపల్ అధికారులు, సిబ్బంది వచ్చి వరదను పెద్ద నాలా గుండా ముందుకు వెళ్లేలా చేయడంతో ప్రమాదం తప్పింది. – సుశీల, టైలర్, జగ్జీవన్‌రాంనగర్

జూరాలకు పోటెత్తిన వరద

- 3,12,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు
- 40 క్రస్టు గేట్ల ఎత్తివేత
- 3,21,335 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

– ధరూరు

- వివరాలు 8లో..

క్లుప్తంగా

గుట్ట దరి కూలి మేకల కాపరి మృతి

అచ్చంపేట రూరల్: ముసురు వానకు మట్టి దిబ్బలు కూలి ఓ మేకల కాపరి మృతిచెందిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. స్థానికుల వివరాల మేరకు.. నలగొండ జిల్లా చందంపేట మండలం పాత తెల్దావర్‌పల్లి గ్రామానికి చెందిన మన్నెం నిరంజన్ (50) కొన్ని రోజుల క్రితం మేకల మేత కోసం అచ్చంపేట మండలంలోని ఘనపూర్, అక్కారం గుట్టల వద్దకు వచ్చాడు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు గుట్టదరి కూలి ప్రమాదవశాత్తు నిరంజన్‌పై పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికులు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. ఈ విషయంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని సిద్దాపూర్ పోలీసులు తెలిపారు.

కాల్వలో పడి మహిళ..

మక్తల్: ప్రమాదవశాత్తు కాల్వలో పడి మహిళ మృతి చెందిన ఘటన మక్తల్ పట్టణంలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. పట్టణంలోని యాదవ నగర్‌కు చెందిన యాదమ్మ (54) పశుసంవర్ధక శాఖలో సబార్డినేట్‌గా పనిచేసేది. ఆమెకు అప్పుడప్పుడు కల్లు తాగే అలవాటు ఉంది. ఎప్పటిలాగే కల్లు తాగిన ఆమె.. పట్టణ సమీపంలోని సంగంబండ రిజర్వాయర్ కాల్వలో ప్రమాదవశాత్తు పడి మృతిచెందింది. మృతురాలి కూతురు చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ భాగ్యలక్ష్మీరెడ్డి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి..


సంతోష్ (ఫైల్)

మక్తల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతిచెందిన సంఘటన మక్తల్ మండలం బోందల్‌కుంట -కాచ్‌వార్ స్టేజీల వద్ద సాయంత్రం 7 గంటలకు చోటుచేసుకుంది. జక్లేర్ నుంచి మక్తల్‌కు వెళ్తుండగా.. రోడ్డు ప్రమాదంతో సంతోష్ గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి, అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. అతడికి భార్య పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

మద్దూరు: ఉమ్మడి మద్దూరు మండలంలో వేర్వేరు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతూ ఇద్దరు మహిళలు మృతిచెందారు. ఎస్‌ఐ రాంలాల్ కథనం ప్రకారం.. కొత్తపల్లి మండలం పెద్దాపూర్ గ్రామానికి చెందిన మేకల లక్ష్మి(36) గత నెల 24న భూనీడ్‌లో ఆంజనేయస్వామి జాతరకు తన అక్క కుమారుడు ఆనంద్‌తో కలిసి బైక్‌పై వెళ్తుండగా భూనీడ్ వాగు దగ్గర వాహనం అదుపు తప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడింది. వెంటనే మహబూబ్‌నగర్‌కు అక్కడి నుంచి నిమ్స్‌కు తరలించారు. నిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతిచెందింది. ఈ ఘటనపై లక్ష్మి భర్త మేకల వెంకటేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

గుర్తుతెలియని వృద్ధురాలు..

మండలంలోని రెనివట్లలో గుర్తుతెలియని వృద్ధురాలు బిచ్చమెత్తుకొని జీవనం సాగిస్తుండేది. ఈ క్రమంలో గత నెల 25న అనారోగ్యంతో బాధపడుతుండగా పోలీసులు ఆమెను మద్దూరు ఆస్పత్రిలో చూయించి మెరుగైన వైద్యం కోసం నారాయణపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందింది. గ్రామ పంచాయతీ వర్కర్ నీరటి రాందాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతురాలి బంధువులు తెలియకపోవడంతో శవాన్ని జిల్లా ఆస్పత్రి మార్చురీలో ఉంచినట్లు చెప్పారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని మొలచింతపల్లికి చెందిన తెలుగు శివమ్మ సోమవారం పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు గ్రామస్తులు తెలిపారు. భర్త శివశంకర్‌తో గొడవపడి మనస్థాపానికి గురై ఇంట్లో ఉన్న ఎలుకల మందు తాగిందని వివరించారు. కుటుంబ సభ్యులు వెంటనే కొల్లాపూర్ సివిల్ ఆస్పత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందించారని, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు వివరించారు.

జూరాలకు పోటెత్తిన వరద


జూరాల ప్రాజెక్టు నుంచి క్రస్టు గేట్ల ద్వారా శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదలవుతున్న వరద

- 3,12,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదు
- 40 క్రస్టు గేట్ల ఎత్తివేత
- 3,21,335 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు వరద పోటెత్తుతోంది. సోమవారం రాత్రి 9 గంటల వరకు 3,12,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదైంది. ప్రాజెక్టు 40 క్రస్టు గేట్లను ఎత్తి 2,70,840 క్యూసెక్కుల వరదను దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఉదయం 3,84,707 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. సాయంత్రానికి వరద ఉధృతి కాస్త తగ్గింది. ఇదిలా ఉండగా, జెన్‌కో జలవిద్యుత్ కేంద్రంలో ఐదు యూనిట్లలో విద్యుదుత్పత్తి కొనసాగిస్తున్నారు. విద్యుదుత్పత్తి నిమిత్తం ప్రాజెక్టు నుంచి 20,611 క్యూసెక్కుల నీటిని వినియోగించు కుంటున్నారు. 45 క్రస్టు గేట్ల ద్వారా 3,75,168 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 45, ఎడమ కాల్వకు 290, కుడి కాల్వకు 195, ఆర్డీఎస్ లింక్ కెనాల్‌కు 50 క్యూసెక్కులతో కలిపి మొత్తం 3,21,335 క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు వైపు విడుదల చేస్తున్నారు.

■ ఎగువన ఉన్న ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులకు వరద ప్రవాహం తగ్గినట్లు అధికారులు తెలిపారు. ఆల్మట్టి ప్రాజెక్టుకు ప్రస్తుతం 78,055 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 42వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్ ప్రాజెక్టుకు లక్షా 30వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. ఒక గేటు ద్వారా 8,272 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు.

228 మి.యూ., విద్యుదుత్పత్తి

ఆత్మకూర్: జూరాల దిగువ, ఎగువ జల విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి నిలకడగా కొనసాగుతుంది. సోమవారం 5 యూనిట్లలో ఉత్పత్తి చేపట్టినట్లు ఎస్‌ఈలు సురేష్, సూరిబాబు తెలిపారు. ఎగువలో 5 యూనిట్ల ద్వారా 195 మెగావాట్లు ఉత్పత్తి చేపట్టారు. ఎగువ, దిగువ కేంద్రాల్లో కలిపి ఇప్పటి వరకు 228.909 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి సాధించామని వివరించారు. అయితే జూరాల ప్రాజెక్టుకు భారీ స్థాయిలో వరద వస్తుండటంతో కేవలం ఎగువ కేంద్రంలో మాత్రమే విద్యుదుత్పత్తి చేపడుతున్నట్లు వివరించారు.

సుంకేసులలో 2 గేట్లు ఎత్తివేత..

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి వరద ఉధృతి పెరిగింది. ఆదివారం ఒక గేటు ద్వారా నీటిని విడుదల చేసిన అధికారులు.. సోమవారం రెండు గేట్లను తెరిచి వరదను దిగువకు విడుదల చేశారు. డ్యాంకు 8,224 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 6,759 క్యూసెక్కులు దిగువకు వదులుతున్నారు. 1,465 క్యూసెక్కుల నీటిని కేసీ కెనాల్‌కు వదిలినట్లు జేఈ రాజు పేర్కొన్నారు.

కోయిల్‌సాగర్‌కు వరద ఉధృతి

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టుకు వరద ఉధృతి కొనసాగుతుండటంతో సోమవారం 4 గేట్లు ఎత్తి 6 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం ప్రాజెక్టుకు పెద్ద వాగు ద్వారా వస్తున్న నీటికి అనుగుణంగా గేట్లను తెరిచి నీటిని వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. ఆదివారం ఇన్‌ఫ్లో పెద్ద ఎత్తున రావడంతో ఏకంగా ప్రాజెక్టుకు ఉన్న 13 గేట్లను ఎత్తి 35 వేల క్యూసెక్కులు వదలగా.. సాయంత్రానికి కాస్త తగ్గడంతో 7 గేట్ల ద్వారా 21 వేల క్యూసెక్కులు వదిలారు. ప్రాజెక్టుకు వస్తున్న ఇన్‌ఫ్లోను అనుసరించి గేట్ల సంఖ్యను పెంచడం లేక తగ్గించడం జరుగుతుందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నీటిని వదలడంతో ఊకచెట్టు వాగు నిండుగా ప్రవహిస్తోంది. నాగన్నపల్లి, చిన్నరాజమూర్, పెద్దరాజమూర్, బస్వాపూర్, గూరకొండ, గోప్లాపూర్ మీదుగా పారుతుండగా.. చిన్నరాజమూర్, బస్వాపూర్, బండర్‌పల్లి వద్ద వాగుపై ఉన్న చెక్‌డ్యాంలు జలకళ సంతరించుకున్నాయి.



కురుమూర్తివాస గోవిందా


రాజగోపురం వద్ద దీపాలు వెలిగిస్తున్న భక్తులు

చిన్నచింతకుంట: ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధిగాంచిన కురుమూర్తిస్వామి దర్శనానికి శ్రావణమాసం చివరి సోమవారం, అమావాస్యను పురస్కరించుకొని భక్తులు తరలివచ్చారు. ముందుగా అర్చకులు ఆలయాన్ని శుద్ధి చేసి సుప్రభాత సేవ నిర్వహించిన అనంతరం భక్తులకు స్వామివారి దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం నుంచే ఉమ్మడి జిల్లా నలుమూలల నుంచి భక్తులు తరలివచ్చి క్యూలైన్లో నిల్చున్నారు. మెట్లపై దీపాలు వెలిగిస్తూ.. గోవింద నామస్మరణ చేశారు. మెట్టు మెట్టుకు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు చెల్లించుకున్నారు. కొండ దిగువన మట్టికుండలో పచ్చిపులుసు అన్నం నైవేద్యంగా తయారు చేసి స్వామివారికి సమర్పించారు. అనంతరం కొండపైన అలివేలు మంగమ్మ, చెన్నకేశవస్వామి, ఆంజనేయస్వామి, ఉద్దాల మండపాలను భక్తులు దర్శించుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణమంతా భక్తుల రద్దీతో కనిపించింది. జాతర మైదానంలో ఏర్పాటు చేసిన దుకాణాల్లో స్వీట్లు, ఇతర వస్తువులు కొనుగోలు చేశారు.


కురుమూర్తిస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

విద్యుదాఘాతంతో పెంకుటిల్లు దగ్ధం

- కాలి బూడిదైన నగదు, నగలు

అద్దాకుల: విద్యుదాఘాతంతో పెంకుటిల్లు దగ్ధమైన ఘటన మూసాపేట మండలం స్ఫూర్తితండాలో సోమవారం చోటుచేసుకుంది. బాధితుల కథనం మేరకు.. తండాకు చెందిన మూడావత్ అమిరియా నాయక్, మణెమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు. ఓ కుమారుడు హైదరాబాద్‌లో ఉండగా.. మరో కుమారుడితో కలిసి తండాలోని పెంకుటింట్లో నివాసం ఉంటున్నారు. సోమవారం అమావాస్య కావడంతో ఇంట్లో పూజ చేసి అందరూ కలిసి ఉదయం మన్యంకొండ ఆలయానికి వెళ్లారు. కాసేపటి తర్వాత ఇంట్లో నుంచి పొగలు, మంటలు రావడాన్ని గుర్తించిన స్థానికులు వెంటనే కుటుంబ సభ్యులు, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపుచేసింది. అయితే అప్పటికే ఇంట్లో ఉన్న బీరువా, ఫ్రిజ్, వంట సామాగ్రి, నగదు, నగలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. కుటుంబ సభ్యులు కాలి బూడిదైన ఇంటిని చూసి కన్నీరుమున్నీరుగా రోదించారు. ఇంటి నిర్మాణానికి తీసుకొచ్చిన రూ.6 లక్షల నగదు బీరువాలో ఉంచగా మొత్తం కాలిపోయినట్లు బాధితులు వాపోయారు. వెండి సామగ్రి కాలి ముద్దగా మారినట్లు తెలిపారు.


కాలిన ఇంటిని పరిశీలిస్తున్న ఎస్‌ఐ శ్రీనివాసులు

బాధిత కుటుంబాన్ని ఆదుకుంటాం..

ఘటనా స్థలాన్ని తహసీల్దార్ బ్రహ్మంగౌడ్, ఎస్‌ఐ పి.శ్రీనివాసులు సందర్శించారు. బాధితులను పరామర్శించి ప్రమాద వివరాలు సేకరించారు. తర్వాత తహసీల్దార్ ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డికి ఫోన్‌చేసి ప్రమాద విషయాన్ని వివరించారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఇల్లు పూర్తిగా కాలిపోయినందున తాత్కాలికంగా గ్రామపంచాయతీ కార్యాలయంలో పునరావాసం కల్పించాలని అధికారులను ఆదేశించారు.

పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిన వైఎస్‌ఆర్


వైఎస్‌ఆర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ తదితరులు

స్టేషన్ మహబూబ్‌నగర్: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి తన హయాంలో అనేక సంక్షేమ పథకాలు అమలుచేసి తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచారని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఆయన వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యెన్నం, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ తదితర నాయకులు వైఎస్‌ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఇందిరమ్మ ఇళ్ల వంటి ఎన్నో చారిత్రాత్మకమైన పథకాలు తెచ్చి తెలుగు ప్రజల సంక్షేమం కోసం కృషిచేశారన్నారు. ఉన్నత వర్గాలకు పరిమితమైన ఇంజినీరింగ్, మెడికల్ లాంటి కోర్సులను నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వమే ఫీజులు చెల్లించి ఎందరినో ఇంజినీర్లుగా, డాక్టర్లుగా తీర్చిదిద్దిన ఘనత వైఎస్‌ఆర్‌కే దక్కుతుందన్నారు. వైఎస్ ఆశయాలకు కొనసాగింపుగా సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో విద్యార్థులు, రైతుల సంక్షేమానికి కృషిచేస్తున్నట్లు వివరించారు. రైతు రుణమాఫీ, పేద విద్యార్థులకు ఫీజు రీయంబర్స్‌మెంట్, పేదలకు ఆరోగ్యశ్రీ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. వైఎస్‌ఆర్ ప్రారంభించిన ప్రతి ప్రాజెక్టును పూర్తి చేసి తీరుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, నాయకులు బెక్కరి అనిత, సీజే బెనహర్, సిరాజ్‌ఖాద్రీ, లక్ష్మణ్‌యాదవ్, నవనీత, అజ్మత్‌అలీ, రాములుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి వ్యక్తి దుర్మరణం

- అత్తింటి వారే చంపి ప్రమాదంగా చిత్రీకరించారని బంధువుల ఆరోపణ
- కల్వకుర్తిలో ఆందోళన.. పోలీసుల లాఠీచార్జి


అశోక్ (ఫైల్)

కల్వకుర్తి టౌన్/ వెల్దండ/ మాడ్గుల: ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి చెట్టును ఢీకొట్టడంతో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. మండలంలోని బొల్లంపల్లి పంచాయతీ పరిధిలోని చల్లపల్లి గ్రామానికి చెందిన కొమ్ము అశోక్(35) అత్త గారి ఊరైన రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం ఇర్విన్ గ్రామానికి సోమవారం తెల్లవారుజామున వెళ్తుండగా బైక్ అదుపుతప్పి చెట్టుకు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో ఘటనా స్థలానికి చేరుకొని బోరున విలపించారు. ఈ ఘటనపై అనుమానం వ్యక్తం చేస్తూ భార్యతో పాటు కుటుంబ సభ్యులపై ఫిర్యాదు చేసినట్లు మాడ్గుల సీఐ జగదీశ్ తెలిపారు.

కొట్టి చంపారని ఆరోపణ

అశోక్ మృతదేహానికి కల్వకుర్తి ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. అయితే బంధువులు మృతదేహంతో పట్టణంలోని పాలమూరు చౌరస్తాలో నిరసన చేపట్టారు. దీంతో చాలావరకు వాహనాలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. గంటకు పైగా వాహనాలు నిలిచిపోవడంతో పోలీసులు అక్కడికి చేరుకొని వారిని సముదాయించారు. ఇంతలోనే బంధువులలో కొందరు మృతుని మరణానికి భార్య వైపు బంధువులే కారణమని, పోలీసులు డౌన్‌డౌన్ అంటూ నినాదాలు చేశారు. వారిని అదుపు చేస్తున్న క్రమంలో కల్వకుర్తి సీఐ నాగార్జున, ఇతర పోలీసులపై మృతుని బంధువులు దురుసుగా ప్రవర్తించడంతోపాటు వారిని తోసే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు నిరసన తెలుపుతున్న వారిపై లాఠీచార్జి చేశారు. అక్కడ ఉన్నవారిని తరిమివేసి, పోలీసులు మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అనంతరం పోలీసులు చౌరస్తాలో ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. రాత్రి 9 గంటల సమయంలో అశోక్ మృతదేహాన్ని బంధువులు ఇంటికి తీసుకెళ్లారు. బందోబస్తులో వెల్దండ సీఐ వేణుగోపాల్‌రెడ్డి, ఎస్‌ఐలు మాధవరెడ్డి, రామచందర్‌జీ, వీరబాబు, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.


మృతుడి బంధువులపై లాఠీచార్జి చేస్తున్న పోలీసులు

నిషేధిత గుట్కా పాకెట్ల పట్టివేత

మరికల్: మండలంలోని పెద్దచింతకుంట దగ్గర భారీగా నిషేధిత గుట్కా పాకెట్లు టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. చిత్తనూర్‌కు చెందిన ఏలూరు నూతన్ అనే వ్యక్తి మహబూబ్‌నగర్ నుంచి చిత్తనూర్‌కు కారులో రూ.98 వేల విలువ గల నిషేధిత గుట్కా పాకెట్లు తరలిస్తున్నట్లు పక్కా సమాచారం అందడంతో పోలీసులు పట్టుకున్నారు. ఈ మేరకు గుట్కా పాకెట్లను మరికల్ పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ మురళి తెలిపారు.

రైళ్లు నిలపాలంటూ.. కృష్ణా గ్రామస్తుల వినూత్న నిరసన



కృష్ణా: సరిహద్దు కర్ణాటకలోని రాయచూర్, యాద్గిర్‌కు మంగళవారం కేంద్ర రైల్వేశాఖ సహాయమంత్రి సోమణ్ణ వస్తున్నారు. దీంతో మండల కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో గతంలో నిలిపే రైళ్లను ఆపాలని.. అందుకు అధికారులు కృషి చేయాలంటూ బీజేపీ జాతీయ కార్యవర్గసభ్యుడు అమర్‌కుమార్ దీక్షిత్ సోమవారం గ్రామస్తులతో కలిసి వినతిపత్రాన్ని కృష్ణానదిలో వదిలి వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ విషయమై మూడేళ్లుగా కేంద్ర మంత్రులు, రైల్వేశాఖ జీఎం, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు వినతిపత్రాలు ఇవ్వడంతో పాటు శాంతియుతంగా ఆందోళనలు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులు తమ విజ్ఞప్తులకు శ్రాద్ధం పలికిన విధంగానే తాము కూడా కృష్ణానదిలో వినతిపత్రం వదిలి తమ సమస్యలకు శ్రాద్ధం పలికినట్లు తెలిపారు. ఈ విషయం కేంద్ర మంత్రికి తెలిసేలా ప్రతి ఒక్కరు ప్రయత్నించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లప్ప, శంకరప్ప, శక్తిసింగ్, కిష్టప్ప, నారాయణభట్ తదితరులు పాల్గొన్నారు.

02ఎంకేఎల్ 301 వినతిపత్రాన్ని కృష్ణానదిలో వదిలి నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఐక్యంగా హక్కులు సాధించుకుందాం


కృష్ణముదిరాజ్‌కు నియామక పత్రం అందజేస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు శ్రీశైలం

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఉద్యమకారులను ఏకం చేసి తమ హక్కుల సాధన కోసం మరో పోరాటానికి సిద్ధం కావాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీశైలం అన్నారు. అందులో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమకారుల కమిటీలను వేస్తున్నట్లు వివరించారు. తెలంగాణ సాధన కోసం తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా పోరాటం చేసిన వాళ్లు చాలామంది ఉన్నారని, వారికి తెలంగాణ రాష్ట్రంలో సరైన గుర్తింపు లభించలేదన్నారు. కాలంతోపాటు తమ విలువైన జీవితాన్ని తెలంగాణ సాధన కోసం జరిగిన పోరాటానికి అంకితం ఇచ్చారని గుర్తుచేశారు. గడిచిన పదేళ్లలో తెలంగాణ ఉద్యమకారులకు ఎలాంటి గుర్తింపు కాని గౌరవం కాని దక్కలేదన్నారు. తెలంగాణ వస్తే తమ బతుకులు బాగుపడుతాయని అనుకున్న వాళ్లకు నిరాశే మిగిలిందన్నారు. ఇకపై ప్రతి జిల్లాలో కమిటీలు వేసి కార్యాచరణ ప్రకారం పోరాటాలు చేద్దామన్నారు. అనంతరం తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడిగా జిల్లాకేంద్రంలోని కొత్తగంజికి చెందిన జీటీ కృష్ణముదిరాజ్ ఎన్నికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీశైలం నియామక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు శివన్న, గోపాలకృష్ణ, బాలచందర్, సురేష్, శ్యాంసుందర్, వెంకటేశ్, అశోకచారి, దినేష్, చంద్రయ్య, రమేష్, పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

తక్షణమే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలి

- టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ ఆదేశం

సాక్షి, హైదరాబాద్: భారీ వర్షాలతో విద్యుత్ సరఫరాలో ఎక్కడైనా అంతరాయాలు ఏర్పడితే తక్షణమే పునరుద్ధరించాలని దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ(టీజీఎస్పీడీసీఎల్) సీఎండీ ముషారఫ్ అలీ ఫారూఖీ ఆదేశించారు. విద్యుత్ సర్కిల్ కార్యాలయాల సీఈలు, ఎస్‌ఈలతో సోమవారం ఆయన టెలీ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. వర్షాలతో భారీ వృక్షాలు, ఇతర వస్తువులు విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయని తెలిపారు. ముందుగా కూలిపోయిన చెట్లను తొలగించి కొత్త స్తంభాలను, లైన్లను వేయాలని సూచించారు. గత రెండు రోజులు విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు విద్యుత్ సిబ్బంది చేసిన కృషిని ఆయన ప్రశంసించారు. సూర్యాపేట జిల్లాలో విద్యుత్ పంపిణీ వ్యవస్థకు భారీ నష్టం వాటిల్లిందని, 1200కు పైగా విద్యుత్ స్తంభాలు కూలిపోగా, 4 సబ్ స్టేషన్లకు నష్టం జరిగిందన్నారు. మొత్తం 2417 విద్యుత్ స్తంభాలు, 21 ట్రాన్స్‌ఫార్మర్లు, 18 సబ్ స్టేషన్స్ దెబ్బతిన్నాయన్నారు. విద్యుత్ సిబ్బంది పనిక్షేత్రంలోనే ఉండి పునరుద్ధరణ పనుల్లో పాల్గొనాలని కోరారు. పాడైపోయిన విద్యుత్ పరికరాల స్థానంలో కొత్త వాటిని ఏర్పాటు చేయడానికి సరిపడ పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎవరైనా విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సబ్‌జైల్ ప్రాంగణం పరిశీలించిన జైళ్లశాఖ డీఐజీ


సబ్‌జైల్ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న డీఐజీ శ్రీనివాస్

కొల్లాపూర్: కొల్లాపూర్‌లోని సబ్‌జైల్ ప్రాంగణాన్ని జైళ్లశాఖ డీఐజీ శ్రీనివాస్ పరిశీలించారు. మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశానుసారం ఆయన సబ్‌జైల్‌ను పరిశీలించినట్లు చెప్పారు. 2016లో సబ్‌జైల్ ప్రాంగణంలో మున్సిపల్ కార్యాలయం నిర్మాణం కోసం పనులు చేపట్టారు. ఈ నిర్మాణంపై జైళ్లశాఖ అధికారులు కోర్టుకు వెళ్లడంతో పనులు నిలిచిపోయాయి. మున్సిపల్ కార్యాలయం నిర్మాణంపై పునరాలోచన చేయాలని మంత్రి జూపల్లి సూచించడంతో జైళ్లశాఖ డీఐజీ శ్రీనివాస్, మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశం, నాగర్‌కర్నూల్ జైలర్ నాగరాజు సబ్‌జైల్ ప్రాంగణాన్ని పరిశీలించారు. భవన నిర్మాణానికి అనుకూలంగా ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. నిర్మాణ పనుల వివరాలను మున్సిపల్ చైర్‌పర్సన్ మేకల రమ్యనాగరాజు ఆయనకు వివరించారు. ఆమె వెంట కౌన్సిలర్లు నర్సింహరావు, రహీంపాష, రాముడుయాదవ్, శిరీషయాదవ్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్ తదితరులున్నారు.

మొసలి పట్టివేత



పుర పరిధిలోని ఖానాపూర్ గ్రామ శివారులో మొసలి సంచరిస్తున్నట్లు గుర్తించిన స్థానిక యువత సోమవారం బంధించి ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇచ్చారు. అమరచింత చెరువు అలుగు పారుతుండటంతో ప్రవాహంలో మొసలి వచ్చి ఉంటుందని గ్రామస్తులు తెలిపారు. అధికారులు మొసలిని జూరాల బ్యాక్ వాటర్‌లో వదిలిపెట్టినట్లు చెప్పారు.

- ఆత్మకూర్



రాంపురంలో..

పెబ్బేరు మండలం రాంపురం గ్రామ ఊరపంపు వాగు కట్టపై సోమవారం అటుగా వెళ్తున్న రైతులకు మొసలి కనిపించింది. భయాందోళనకు గురైన వారు కాసేపు కదలికను పరిశీలించారు. అనంతరం వాగులోకి వెళ్లిపోయింది. అధికారులు మొసలిని బంధించాలని కోరుతున్నారు.

- వనపర్తి రూరల్